ఇసుక తోడేళ్లు..!

- మంత్రాలయంలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా
- విచ్చలవిడిగా ఇసుక తరలింపు
- కళ్లు మూసుకున్న రెవెన్యూ యంత్రాంగం
- ఇసుక ముఠాతో విసుగెత్తిపోతున్న విద్యార్థులు, పట్టణవాసులు



నదిలో ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుంటున్న తహసీల్దార్ రమాదేవి

మంత్రాలయం : ఇక్కడి ఇసుక మాఫియా దర్జానే వేరు. పగలూ రాత్రి తేడా లేదు. అడ్డూ అదుపు అంతకన్నా లేదు. ఇచ్చుకుంటే చాలు.. ఇసుకంతా తమదే అన్నంతగా రెచ్చిపోతున్నారు. పచ్చ నేతలను ప్రసన్నం చేసుకొని తుంగభద్రమ్మను తోడేస్తున్నారు. ఇసుక దోపిడీ చేస్తూ తామే దొరలు అనిపించుకుంటున్నారు. ఇసుక ట్రాక్టర్ల రొదతో విద్యార్థులు రోడ్డెక్కితే పక్కకు నెట్టేస్తున్నారు. అధికారులకు సవాల్ విసురుతూ తమ దర్జాను ప్రదర్శిస్తున్నారు. ఇంతగా ఇసుక మాఫియా రెచ్చిపోతున్నా.. కార్యాలయాల ఎదుటే ట్రాక్టర్ల మోత మోగుతున్నా ఇక్కడి అధికారుల్లో చలనం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నదిలో నీరు తగ్గితే చాలు..

తుంగభద్ర నదిలో వరద ప్రవాహం తగ్గితే చాలు ఇక్కడి మాఫియాకు పండగే పండగ. పట్టపగలే నదిలో వాలిపోతున్నారు. యథేచ్ఛగా ఇసుక తోడుతున్నారు. నదిలో నిరుతగ్గడంతో గత వారం రోజులుగా ఇక్కడి ఇసుక మాఫియా మేల్కొంది. మంత్రాలయం ఈశాన్య దిశలో ఇసుకను తోడే పనిలో పడింది. మంత్రాలయంలో 35 ట్రాక్టర్లు అదే పనిగా ఇసుకను తరలిస్తున్నారు. రాత్రి పగలూ తేడా లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. కూటమి నాయకులు, కార్యకర్తల ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు.

నిద్రావస్థలో రెవెన్యూ అధికారులు

ఇక్కడి రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా నిద్రావస్థలో ఉండిపోయింది. కార్యాలయం ఎదుటే ఇసుక ట్రాక్టర్లు రయ్యిం మంటూ పోతున్నా కుర్చీలను వీడి అడుగు వేయడం లేదు. కారణం కూటమి పాలకుల ఆశీస్సులు మాఫియాకు మెండుగా ఉండటం. రోజుకు 500 ట్రాక్టర్ల లోడు ఇసుక ఇక్కడి నుంచి తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ రోజుకు 30 టిప్పర్ల దాకా ఇసుక తీసుకెళ్తున్నట్లు అంచనా.

విసుగెత్తిన విద్యార్థులు

మంత్రాలయంలోని తుంగభద్ర నది నుంచి పాతూరులో నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా తీసుకెళ్తున్నారు. పాతూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముంగిట, అటు శారద ప్రైవేటు స్కూలు ముందుగా వెళ్తున్నారు. ప్రతి పది నిమిషాలకోసారి ట్రాక్టర్లు వెళ్తుండటంతో విద్యార్థులు విసుగెత్తిపోతున్నారు. మంగళవారం ఏకంగా ఇసుక ట్రాక్టర్లకు అడ్డుపడి తమ ఇబ్బందులను వ్యక్తం చేశారు. అయినా ఇసుక మాఫియా తీరులో మార్పులేకపోయింది. బుధవారం యథావిధిగా రవాణా కొనసాగించారు.



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

తూతూమంత్రంగా దాడులు

పాఠశాల విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఇసుక ట్రాక్టర్లను నిలిపితేగాని రెవెన్యూ అధికారులు మేల్కోలేదు. బుధవారం సాక్షి పత్రికలో 'ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి స్థానిక తహసీల్దార్ రమాదేవి బుధవారం దాడులకు పూనుకున్నారు. నదిలో ఇసుకను తోడుతున్న 5 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఐదు ట్రాక్టర్లపై రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. అయితే అంతకు మించి ట్రాక్టర్లను పట్టుకున్నా మీడియాకు మాత్రం 5 ట్రాక్టర్లు పట్టుకున్నట్లు చెప్పుకొచ్చారని సమాచారం. అందులో దుల్లయ్య, చిన్న సుంకప్ప, బి.రాఘున్న, హనుమంతు, తిక్కయ్య ట్రాక్టర్లు పట్టుకుని జరిమానా వేశారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా..ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటుంన్నాం, దాడులు చేసి రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని జరిమానా విధిస్తున్నామన్నారు. ఇసుక ట్రాక్టర్లు పట్టుకోగానే టీడీపీ బృందం రెవెన్యూ కార్యాలయంలో వాలిపోయింది. జరిమానాను కుదించుకునేందుకు యత్నించింది. ఏది ఏమైనా ఇసుక మాఫియాకు అడ్డుకట్ట పడుతుందో లేదో వేచిచూడాలి.

పెండింగ్ డీఏలను ప్రకటించాలి

ఆదోని సెంట్రల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు అందించాల్సిన పెండింగ్ డీఏలను తక్షణమే ప్రకటించాలని ఎస్టీయూ మాజీ రాష్ట్ర కౌన్సిలర్ నరసింహులు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్టీయూ భవనంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు 4 డీఏలలో ఒక్కటి కూడా ప్రకటించలేక పోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించి వాటిని అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఎస్టీయూ సీనియర్ నాయకులు శ్రీనివాసులు, కాశీ విశ్వనాథ్, జ్యోతిమూర్తి, తిమ్మప్ప, అయ్యప్ప పాల్గొన్నారు.

సీజేపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ఆదోని రూరల్: భారత సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి చేసిన వారిని శిక్షించాలని ఎంఎస్పీ కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి బండారి హనుమంతు మాదిగ, ఎంఎస్పీ జిల్లా నాయకులు బాలన్న మాదిగ, పీఎస్ వీరేష్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సీజేఐపై జరిగిన దాడికి నిరసనగా ఈనెల 17వ తేదీన ఆదోని సబ్‌కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపడతామన్నారు. నిరసన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు జగన్, కిరణ్, తిమ్మన్న, శాంతరాజ్, రాజు, అంజినప్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రపతి పదవికే వన్నె తెచ్చిన అబ్దుల్‌కలాం



అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: భారత రత్న ఏపీజే అబ్దుల్ కలాం రాష్ట్రపతి పదవికే వన్నె తెచ్చిన మహనీయుడని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ఎస్టీయూ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, బసవరాజు, ప్రసన్న రాజు, బాబయ్య, ఎల్లప్ప పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి సేవలు మరువలేనివి



బార్ అసోసియేషన్ కార్యాలయంలో అబ్దుల్‌కలాం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

ఆదోని రూరల్: భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం సేవలు మరువలేనివని జూనియర్ న్యాయవాదులు అంజనప్ప, మస్తాన్‌వలి, సద్దాం, ఉసేన్, సాయికుమార్, వీరేష్ అన్నారు. బుధవారం స్థానిక ఆదోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తేనెటీగల పెంపకంతో స్వయం ఉపాధి



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న కేవీకే సమన్వయకర్త డా. రాఘవేంద్రచౌదరి

ఎమ్మిగనూరురూరల్: తేనెటీగల పెంపకం వలన యువత స్వయం ఉపాధి పొందవచ్చని కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఆయన మాట్లాడుతూ పూలతోటలు, నూనె గింజల పంటలలో తేనె టీగల పెట్టెలు అమర్చడం ద్వారా దిగుబడులు పెరుగుతాయన్నారు. అనంతరం 29 మంది యువతీ, యువకులకు శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ రమేష్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

233 మందికి స్వర్ణామృత ప్రాసనం పంపిణీ



చిన్నారులకు మందు వేస్తున్న అవోపా పట్టణాధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా

ఆదోని అర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో కాకుబాళ నగేష్ సౌజన్యంతో 17వ విడత స్వర్ణామృత ప్రాసనం మందును బుధవారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో పంపిణీ చేశారు. మొత్తం 233 మంది చిన్నారులకు మందు అందజేసినట్లు అవోపా పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. కార్యక్రమంలో ఆదోని పట్టణ అవోపా కార్యదర్శులు రఘు, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు ప్రతాప్ ఈరన్నశెట్టి, వెంకటేష్ బాబు, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పత్తికి రూ.10,500 గిట్టుబాటు ధర కల్పించండి

కౌతాళం: పత్తి పంటకు గిట్టుబాటు ధర క్వింటల్‌కు రూ.10,500 కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బుధవారం ఆదోని మార్కెట్‌యార్డ్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి సెక్రటరీ గోవిందుకు వినతి పత్రాన్ని అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, ఉపాధ్యక్షుడు మల్లయ్య మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు ముందుగా రావడంతో రైతులు సంతోషంతో పత్తి, మిరప, వేరుశనగ, ఉల్లి వంటి వివిధ పంటలు సాగుచేశారన్నారు. పంట చేతికొచ్చే దశలో అధిక వర్షాల వల్ల ఉల్లి రైతులు పూర్తిగా నష్టపోయారని, ప్రభుత్వం ఉల్లి క్వింటాకు రూ.1200 ధర కల్పిస్తామని చెప్పినా రూ.5 వందలు కూడా కల్పించలేక పోయిందన్నారు. పత్తి పంట వర్షాల వల్ల కాయలు కుళ్లి పోతున్నాయని, ఎకరాకు 4క్వింటల్ దిగుబడి కూడా రాని స్థితి ఏర్పడిందన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం ఇచ్చి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్న, హనుమంతు, వీరేష్, బాషా, లింగన్న పాల్గొన్నారు.

పీపీపీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



పీడీఎస్‌ఓ నాయకులతో కలిసి నినాదాలు చేస్తున్న పీడీఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్

ఆదోనిసెంట్రల్/ఆదోని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పీడీఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మహల్తీ ఫంక్షన్ హాల్‌లో పీడీఎస్ఓ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా మహాసభ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కన్వీనర్ కె.తిరుమలేష్ అధ్యక్షత వహించారు. ఎ.సురేష్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీల పీపీపీ విధానానికి ఇంత వ్యతిరేకత వస్తున్నా కూటమి ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదన్నారు. అంటే ఇందులో ఎంత లాభం ఉందో స్పష్టమవుతోందన్నారు. మెడికల్ కాలేజీలు ప్రభుత్వాలు నడపలేవనే వాదన అసత్యమన్నారు. అనంతరం పీడీఎస్ఓ కర్నూలు జిల్లా కమిటీ ఎన్నికలు జరిగాయి. కె.తిరుమలేష్ జిల్లా కన్వీనర్‌గా, ఆర్.తేజ, ఎం.రాజేష్‌లు కో కన్వీనర్‌లుగా ఎన్నికయ్యారు. సభ్యులుగా సురేంద్ర, ఇమ్రాన్, స్వామి, రాజు, వసంత, గర్ల్స్ కమిటీ కన్వీనర్‌గా నిఖిత, సభ్యులుగా శ్రావణి, పీరమ్మ, ప్రియాంకలను ఎన్నుకున్నారు.

శిథిలావస్థలో పశువైద్య కేంద్రాలు



శిథిలావస్థకు చేరిన మాధవరం వైద్యశాల



పెచ్చులూడిన కల్లుదేవకుంట పశువైద్యశాల

మంత్రాలయం రూరల్ : పాడి పశువుల ప్రాణాధారమైన పశువైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరాయి. చినుకు పడితే కేంద్రాల్లో పైకప్పులు కారుతున్నాయి. ఎప్పుడు కూలుతాయో నన్నంతగా దుస్థితి దాపురించింది. కనీసం మందులు, పరికరాలు భద్రంగా ఉంచుకోవడానికి కూడా అవకాశం లేని దుస్థితి. మండలంలోని కల్లుదేవకుంట పశువైద్య కేంద్రంలో పూర్తిగా పైకప్పు పెచ్చులూడిపోయింది. అలాగే మాధవరం వైద్యశాలలో ఏ మాత్రం చినుకులు రాలిన పూర్తిగా కారిపోతోంది. కారణంగా డాక్టర్లు, కాంపౌండర్లు అవస్థల నడుమ చికిత్సలు కొనసాగించాల్సి వచ్చింది.

కేసు నమోదు

ఆదోని రూరల్: ఈనెల 7వ తేదీన మండలంలోని దిబ్బనకల్ గ్రామంలో పొలం రస్తా విషయంలో గుజ్జల జయలక్ష్మి అనే మహిళను కులం పేరుతో దూషించి తిట్టినందుకు కురువ శివరాజు, కురువ అఖండమ్మ, కురువ రాజమ్మ, కురువ వన్నమ్మలపై కేసు నమోదు చేసినట్లు ఆదోని రూరల్ సీఐ నల్లప్ప తెలిపారు. అలాగే పొలం రస్తాలో కురువ వన్నమ్మను కొట్టారని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. జయలక్ష్మి, హరిజన అంజినయ్య, ఈరమ్మలపై కౌంటర్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వాల్మీకులను ఎస్టీలుగా ప్రకటించాలి

పెద్దకడబూరు : కర్నూలు గడ్డపై గురువారం జరిగే సభలో నరేంద్రమోదీ బోయ వాల్మీకులను ఎస్టీలుగా ప్రకటించాలని వాల్మీకి బోయ సమితి నియోజకవర్గ అధ్యక్షుడు శేఖర్, మండల అధ్యక్షుడు లక్ష్మన్న డిమాండ్ చేశారు. మండల పరిధిలోని చిన్నకడబూరులో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బోయ వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తామని హామీ ఇచ్చారన్నారు. 2014లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బోయ వాల్మీకులను ఎస్టీలుగా అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు తీర్మానం చేసి కేంద్రానికి పంపించానని చెప్పారని గుర్తు చేశారు.

పీఎం మోదీ సభను విజయవంతం చేద్దాం

గోనెగండ్ల : కర్నూలులో గురువారం జరిగే ప్రధాని మోదీ సభను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ మణి మంజరి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీఎస్టీ (తగ్గించిన)విధానం వలన పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కర్నూలు లో జరిగే మోదీ సభకు మండలానికి 54 బస్సులను కేటాయించడం జరిగిందన్నారు. ఆ బస్సులను ఆయా గ్రామాలకు ఇప్పటికే పంపియడం జరిగిందని తెలిపారు. ఆయా శాఖల అధికారుల సమన్వయంతో మండలానికి వచ్చిన 54 బస్సుల్లో ఆయా గ్రామాల నుంచి ప్రజలను బస్సుల్లో సురక్షితంగా తీసుకెళ్లి గమ్యం చేర్చే బాధ్యత వహించాలని సూచించారు. మోదీ సభకు ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం హేమలత, ఏపీఓ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప

ఎమ్మిగనూరుటౌన్: పేదలకు వైద్య విద్య అందించడంతో పాటు బడుగులకు ఉచిత వైద్యం అందేలా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మిస్తే.. వాటికి కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పగించే కుట్రకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల సేకరణను ఒక ఉద్యమంలా చేపడుతోందని పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని 4వ వార్డులో ఆ వార్డు ఇన్‌చార్జ్ కనికె నాగేంద్ర అధ్యక్షతన అనుబంధ కమిటీలను ఏర్పాటు చేసి మాట్లాడారు. వారు మాట్లాడుతూ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక ఆదేశాల మేరకు నియామకమయ్యే పార్టీ అనుబంధ కమిటీలు కోటి సంతకాల సేకరణలో భాగంగా కూటమి కుట్రలను ప్రజలకు తెలియజేసి వారిలో చైతన్యం తేవాలని కోరారు. కార్యక్రమంలో వార్డ్ వైఎస్సార్‌సీపీ నాయకులు యుసూఫ్, జేరుబండి రఘువీర, గోవిందరాజులు, నరేష్, శంకరయ్య పాల్గొన్నారు.

బస్సు ఢీ కొని 12 మేకలు మృతి



బస్సు ఢీకొన్న ఘటనలో మృతి చెందిన మేకలు

పెద్దకడబూరు : మేకల మందపై బస్సు దూసుకెళ్లిన సంఘటనలో 12 మేకలు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎమ్మిగనూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన బాధితుడు గొల్ల తిమ్మప్ప పెద్దకడబూరు మండలం హనుమాపురం గ్రామ సమీపంలోని నలంద కాలేజ్ వద్ద మంగళవారం రాత్రి గొర్రెలతో పాటు మేకలను ఆపుకున్నాడు. వర్షం రావడంతో ఒక్కసారిగా మేకలు పక్కనే ఉన్న ఆదోని ఎమ్మిగనూరు ప్రధాన రహదారిపైకి వచ్చాయి. ఆ సమయంలో రోడ్డుపై ఆదోని నుంచి ఎమ్మిగనూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని బస్సు మేకల మందపై దూసుకెళ్లి ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో 12 మేకలు అక్కడికక్కడే చనిపోగా.. మరికొన్ని మేకలు గాయపడ్డాయి. అప్రమత్తమైన గొర్రెల కాపరులు ద్విచక్ర వాహనంపై వెళ్లి ఎమ్మిగనూరు బస్టాండ్‌లో బస్సు కోసం ఆరా తీశారు. బస్సు అక్కడ లేదు. బస్సు బస్టాండ్‌లోకి వెళ్లకుండా నేరుగా బైపాస్‌లో వెళ్లి ఉంటుందని స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు పెద్దకడబూరు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనలో దాదాపు రూ. 2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తిమ్మప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. మేకలే జీవనాధారం అయిన తనకు అధికారులు స్పందించి ఆదుకోవాలని వేడుకున్నాడు.

ధాన్యపు గింజలతో ప్రధాని చిత్రం



ఎమ్మిగనూరుటౌన్: పట్టణానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కాకె వెంకటేషప్ప చిరుధాన్యాలతో దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రాన్ని చిత్రించి స్థానికులను బుధవారం అబ్బురపరిచారు. ప్రధాని కర్నూలు పర్యటనకు వస్తున్నందున సహజ సిద్ధమైన బియ్యం, కొర్రలు, అవిసె గింజలు, గసాలు, కందులు, ఎర్రపప్పు, సజ్జాగింజలు, ఆవాలు, గులాబీ రేకులతో ఆయన చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు.

చిరుధాన్యపు గింజలతో ప్రధాని మోదీ చిత్రాన్ని చిత్రించిన ఉపాధ్యాయుడు కాకె వెంకటేషప్ప

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి



ఎంఈఓ-1 మొయినుద్దీన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

మంత్రాలయం రూరల్ : బదిలీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో ఎంఈఓ-1 మొయినుద్దీన్‌కు ఎస్టీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. మంత్రాలయం మండలంలో 3వ కేటగిరీలోని వివిధ పాఠశాలల్లో డీఎస్సీ 2025 వారికి సబెక్టుల వారీగా ఉపాధ్యాయ పోస్టులలో ఖాళీలు చూపించకపోడంతో ఆ పాఠశాలలో బదిలీ పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీలు చూపించకపోడంతో ఆ పాఠశాలలకు నూతన ఉపాధ్యాయులు రాలేదని, ఎంఆర్సీ అధికారులు సరైన ఖాళీలు వివరాలు పంపకపోవడంతో ఇలా జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు బసవరాజు, ప్రసన రాజు, బాబయ్య, ఎల్లప్ప, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి

పత్తికొండ: కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అవరణలో న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించి నిరసన చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు, మాజీ ఏజీపీ నరసింహ ఆచారి పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం

ఆదోని టౌన్: క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకున్‌బాను పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక శంకర్‌నగర్‌లోని లేబర్ కాలనీలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ర్యాలీ నిర్వహించి ప్రజలకు టీబీ నివారణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ, రక్తం పడడం, ఛాతీలో నొప్పి, ఆయాసం తదితర లక్షణాలు ఉన్నవారు ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాబురాజు, మేరీ అరుణ, దేవోజీ, సుబ్బమ్మబాయి, ఏఎన్‌ఎం బుజ్జమ్మ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాను ఎందుకు అడగడం లేదు?



ఆదోనిలో జీమ్ వద్ద రోడ్డుపై ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్/రూరల్: ప్రత్యేక హోదా కోసం నాడు ధర్మ పోరాటాలు, దీక్షలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఎందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అడగడం లేదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు అఖండ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దస్తగిరి ప్రశ్నించారు. బుధవారం నరేంద్ర మోదీ జిల్లా పర్యటనను వ్యతిరేకిస్తూ పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గో బ్యాక్ మోదీ అంటూ పట్టణంలోని జీమ్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ విభజన హామీలు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయని ప్రధాని నరేంద్ర మోదీ రాయలసీమ, కర్నూలులో ఎలా పర్యటిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, శేఖర్, మోహన్, హాజీ, హుస్సేని, ఆచారి, ధను, కార్తీక్, బసవ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో పీఎం గోబ్యాక్ అంటూ నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష పార్టీ శ్రేణులు

నల్లజెండాలతో నిరసన

ఎమ్మిగనూరుటౌన్: ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడాన్ని విస్మరించడమే కాకుండా రాయలసీమ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజిని అమలు చేయని ప్రధానమంత్రి రాష్ట్రానికి వచ్చి ఏమి చెబుతారని వామపక్ష పార్టీల నాయకులు రంగన్న, గోవిందు, రాజులు ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని ప్రధాన మంత్రి గోబ్యాక్ అంటూ నల్లజెండాలతో సీపీఐ, సీపీఎం,సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీల ఆధ్వర్యంలో స్థానిక సోమప్ప సర్కిల్ వద్ద నల్లజెండాలతో నిరసన తెలిపారు. నాయకులు రాజీవ్, మద్దిలేటి నాయుడు, రాముడు, ప్రసాద్, కేసీ జబ్బార్ పాల్గొన్నారు. అలాగే నందవరంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్, జిల్లా సమితి సభ్యులు సోమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.



మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి సర్కిల్ నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీ నాయకులు

విభజన హామీలు అమలు చేయాలి

మంత్రాలయం రూరల్ : రాష్ట్ర విభజన హామీలు, ప్రత్యేక హోదా అమలు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్, సీపీఎం మండల కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి రాఘవేంద్ర స్వామి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి వామపక్ష పార్టీ నాయకులు ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలు, ప్రత్యేక హోదాను తుంగలో తొక్కిన నేడు కర్నూలు వస్తున్న ప్రధానమంత్రి మోదీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీ నాయకులు అనిల్, రాజు, దానియల్, ఎలీషా, ప్రాణేష్, ఏఐవైఎఫ్ నాయకులు రాజు పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దకడబూరులో సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు తిక్కన్న, వీరేష్, కోసిగిలో సీపీఎం, సీపీఐ నాయకులు రాముడు, గోపాల్, వీరేష్, రాజు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.